క్లుప్తంగా

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



చిన్నబ్బి కుటుంబాన్ని పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజనులు ఆపదలో ఉన్నప్పుడు అన్ని వేళల అండగా ఉంటూ కష్టా నష్టాల్లో ఎప్పుడు తోడుగా ఉంటానని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని రంగశీలలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. గ్రామంలో మాజీ ఎంపీటీసీ కంబిడి చిన్నబ్బి కుమారుడు ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి పొందుతున్న బాలుడిని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సివేరి కొండలరావు, సర్పంచ్ తాంగుల మోహన్‌దాస్, నాయకులు కామరాజు, సింహాచలం ,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పలకలు, పుస్తకాల పంపిణీ



పలకలు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాత సత్యనారాయణ

కొయ్యూరు: అడవి బిడ్డలకు విద్యాదానంలో భాగంగా కొయ్యూరు రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ ఆదివారం బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలలో 40 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ గిరిజనులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు తన వంతు సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా నెలకు ఒక పాఠశాలను ఎంపిక చేసుకుని అక్కడి విద్యార్థులకు పలకలు, పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. దుమంతి కిరణ్, పొగడాల అరవింద్, కిలే లక్ష్మణ్, మొయిరి మహేశ్, కొక్కుల రవి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ప్రార్థన చేస్తున్న పాస్టర్ సంజీవ్‌కుమార్

అరకులోయ టౌన్: మండలంలోని బెంజిపూర్ లూథరన్ చర్చిలో ఆదివారం కొవ్వొత్తుల ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రెవరెండ్ పాస్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ వేళంగిని పుణ్యక్షేత్రం నుంచి సంఘ పెద్ద భూపతి లెనిన్‌రాజ్ కుటుంబం దేవునికి కానుకగా బహుకరించిన కొవ్వొత్తులను సండే స్కూల్ చిన్నారులు అభివిక్కీ, హర్ష, శ్రీ తదితరులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని, అందరూ అనుసరించాలని కోరారు. శాంతిభూపతి, డొంబూర్, సునీత, రాజేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంఠారంలో ఎమ్మెల్యే పర్యటన

కొయ్యూరు: మండలంలోని కంఠారంలో సోమవారం జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, నాయకుడు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం బకులూరు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు లాగరాయిలో 'గడప గడపకు'

రాజవొమ్మంగి: లాగరాయి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తీరనున్న ఇక్కట్లు

- బిరిగూడ వాగుపై వంతెనకు రూ.3.55కోట్ల నిధుల మంజూరు
- ప్రారంభం కానున్న పనులు
- ఆనందంలో గిరిజనులు



ఉధృతంగా ప్రవహిస్తున్న బిరిగూడ వాగు



బిరిగూడ వాగు వద్ద వంతెన నిర్మాణానికి కొలతలు తీస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగు ఏడాది పొడువునా నీరు ప్రవహిస్తూ ఉంటుంది. వర్షాకాలంలో బిరిగూడ వాగు ఉధృతితో బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో 26 గ్రామాల గిరిజనులు రాకపోకలకు అవస్థలు పడాల్సిందే. ప్రాణాలకు తెగించి, అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటుతూ పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. కొన్నేళ్లుగా రవాణా కష్టాలు పడ్డారు. గత టీడీపీ హయాంలో గ్రామస్తులు పలుమార్లు పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్బూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం మీదగా బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం వరకు తారురోడ్డు సౌకర్యం కల్పించారు. ఈ మార్గంలో అవసరమైన మూడు చోట్ల వంతెన నిర్మాణాలకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిధులు సైతం మంజూరయ్యాయి.

రూ.3.55కోట్ల నిధులు : బిరిగూడ వాగుపై వంతెన నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రలు ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రూ.3.55 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వర్షాలు తగ్గిన వెంటనే వంతెన పనులు మొదలు కానున్నాయి. బిరిగూడ వాగు వద్ద వంతెన నిర్మాణానికి మార్కింగ్ పనులు పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఆయా ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



బిరిగూడ వాగు వల్ల వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. గత్యంతరం లేక గ్రామస్తులు తాడు, డిప్పల సహాయంతో వాగు దాటుతున్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరడం చాలా సంతోషంగా ఉంది. వెంటనే వంతెన పనులు మొదలు పెట్టాలి.వేగంగా పూర్తి చేయాలి.

– జన్రెల నోబిన, సర్పంచ్, బుంగాపుట్టు, ముంచంగిపుట్టు మండలం

కష్టాలు తీరనున్నాయి



లబ్బూరు నుంచి బుంగాపుట్టు వరకు రహదారిని ఇప్పటికే పూర్తి చేశాం. బిరుగూడ వాగుపై వంతెన లేక బుంగాపుట్టు, లక్ష్మీపురం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరయ్యేలా కృషి చేశాను. వర్షాల వల్ల పనులు ఇంకా మొదలు కాలేదు. త్వరలో పనులు మొదలు అవుతాయి. గిరిజనులకు బిరిగూడ వాగు కష్టాలు త్వరలోనే తీరనున్నాయి.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు

పనులు పూర్తయ్యేలా చర్యలు

మూడు చోట్ల వంతెనలు మంజూరయ్యాయి. ముఖ్యంగా బిరిగూడ వాగు వద్ద వంతెనకు సంబంధించి మార్కింగ్ పనులు పూర్తి చేశాం. వంతెన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తాం. బిరిగూడ వంతెనకు రూ.3.55కోట్లు, సుత్తిగూడ వంతెనకు రూ.3.27కోట్లు, ముత్తగుమ్మి వంతెనకు రూ.3.32కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వేగంగా పనులు మొదలు పెట్టి సకాలంలో పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బి.రవికుమార్, డిఈఈ. పీఆర్ ప్రాజెక్టు, పెదబయలు సబ్ డివిజన్

ముమ్మరంగా వ్యవసాయ పనులు

హుకుంపేట: మండలంలోని వర్షాలు విస్తారంగా కురువడంతో గిరిజనులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామల్లో వరి పంటతో పాటు రాగులు, సామలు పంటలు పండించేందుకు నార్లు తీయడం, తీసిన నారుని నాట్లు వేయడం వంటి పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ ఏడాది రాగులు, సామలు పంటలను ప్రభుత్వం తరపున ఆర్‌బీకేల్లో కొనుగోలు చేస్తుండడంతో గిరిజనులు ఆయా పంటలను విస్తారంగా పండిస్తున్నారు. కొర్రలు, రాగులు, సామలు తదితర తృణధాన్యాలు సాగుతో లాభాలు పొందవచ్చని ఉన్నతాధికారుల సూచనల మేరకు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. పంటల సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. గ్రామల్లో ఎక్కడ చూసినా దుక్కిలు చేస్తు నాట్లు వేస్తున్న పనులు జరుగుతున్నాయి.



జి.బొడ్డాపుట్టు ప్రాంతంలో రాగుల పంట నాట్లు వేస్తున్న గిరిజనులు

నేడు ఉమానీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి

సాక్షి,పాడేరు: స్థానిక పాతబస్టాండ్‌లోని శివాలయంలో కొలువుదీరిన ఉమానీలకంఠేశ్వరస్వామి సోమవారం శాకంబరుడుగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఒక రోజు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్నివర్గాల భక్తుల సహకారంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొవాలని ఆయన కోరారు.

ఆదమరిస్తే అంతే

- అంత్రిగుడ సమీపంలో ప్రమాదకరంగా మలుపు
- కానరాని హెచ్చరిక బోర్డులు



అంత్రిగుడ వద్ద ప్రమాదరకంగా ఉన్న మలుపు

డుంబ్రిగుడ: మండలంలో అరకు–పాడేరు ప్రధాన రహదారి అంత్రిగుడ సమీపంలో గల మలుపు వద్ద నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతనెలలో ఈ మలుపు వద్ద విశాఖపట్నానికి చెందిన ఓ పర్యాటకుడు వాహనం అదుపు తప్పి మృతి చెందిన విషయం తెలిసిందే. మరో సంఘటనలో డుంబ్రిగుడ గ్రామానికి చెందిన ఇద్దరు వాహనచోదకులు ప్రమాదబారిన పడి తీవ్ర గాయాలపాలయ్యారు. నిత్యం ఈ మార్గంలోని మలుపు వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాద స్థలంలో మలుపు ఎక్కువగా ఉండి.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉందని వాహనచోదకులు చెబుతున్నారు. మలుపు వద్ద వాహనం అదుపు తప్పితే ప్రమాదం బారిన పడతారని చెబుతున్నారు. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పొంగిన గెడ్డలతో ఇబ్బందులు



ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ వద్ద గిరిజనులు

డుంబ్రిగుడ: మన్యంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని సంపంగిగెడ్డ, చాపరాయి గెడ్డలున్న ప్రాంతాల్లో కాజ్‌వేలు లేకపోవడంతో దాటేందుకు స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో భయం భయంతో గెడ్డలు దాటుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాజ్‌వేలు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



మీనామృతాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



చేపల వ్యర్థాలు, బెల్లంతో తయారు చేసిన మీనామృతం

ఎస్.రాయవరం: ప్రకృతి వ్యవసాయ విధానంతో శ్రేష్ఠమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్‌ఎఫ్‌ఏ శ్యామల తెలిపారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక వనరులతో జీవామృతం, సేంద్రియ ఎరువుల తయారీ విధానంలో మెలకువలను వివరించారు. స్థానికంగా లభించే చేపల వ్యర్థాలు, బెల్లం కలిపి 100 లీటర్ల మీనామృతం తయారు చేశారు. మీనామృతాన్ని పంటలకు ఎలా ఉపయోగించాలో వివరించారు. దీంతో ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎల్ 1 రాము, ఎల్ 3 కనకారావు, ఏపీ సీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యూరు: భారతీయ విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పాంగి చందు, వంతల రంగారావు, కార్యదర్శులుగా పండు నాయుడు, వంతల చిట్టిబాబు ఎన్నికయ్యారు. గిరిజన సంఘం నేత ఎస్.సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదవి ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జీవణ్ కృష్ణ, రాజు, సింహాద్రి, కిరణ్ పాల్గొన్నారు

శాకంబరి అలంకరణలో నూకాంబిక

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలోని శ్రీ నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం చివరి వారం కావడంతో ఆలయ అర్చకులు అమ్మవారికి కూరగాయలు, ఫలాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



శాకంబరీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న నూకాంబిక అమ్మవారు

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం



మోదకొండమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట : కశింకోటలోని పొలాల్లో ఆదివారం మోదకొండమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, రైతు సంఘం అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావుతో పాటు భక్తులు, రైతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అరటి గెలలు, చీరలు, రవికెల రూపంలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



కానివాడలో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

వై.రామవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి చెప్పారు. మండలంలోని కానివాడ గ్రామ సచివాలయం వద్ద ఆదివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సుమారు 200 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ సత్వరమే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, నాయకుడు కరణం కనకరాజు, ఈఓపీఆర్‌డీ మధుసూధనరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారం.. ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్లపై వ్యాపారం చేస్తున్న మైదాన ప్రాంత వ్యాపారస్తులు

అరకులోయ రూరల్: వారపు సంతలో రోడ్డు పై వ్యాపారాలతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు చెబుతున్నారు. మండలంలో సుంకరమెట్ట వారపు సంతలో ఆదివారం కటికి జలపాతం వైపు వెళ్లే రహదారిపై మైదాన ప్రాంత వ్యాపారులు అమ్మకాలు చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పోలీస్ శాఖ సహకారంతో సంత ప్రాంతంలోని రహదారికి ఇరువైపులా నిర్వహిస్తున్న దుకాణాలను వేరేచోటుకు తరలించారని పలువురు చెప్పారు. అయితే ఈ వారం యథావిధిగా రోడ్డుపైనే తాత్కాలిక దుకాణాలతో వ్యాపారాలు సాగించడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన



పాలకొండలో పసుపులో అంతర పంటలను పరిశీలిస్తున్న ప్రసాద్

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ పసుపు సాగులో పలు అంతర పంటలపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ తెలిపారు. మండలంలో కోరాపల్లి పంచాయతీ పాలకొండ గ్రామంలో ప్రకృతి వ్యసాయంలో పీఎండీఎస్ పసుపు సాగులో పలు పంటలు వేసుకొనే విధానంపై రైతులు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఒక ఎకరా భూమిలో 9 నుంచి 15 రకాలు విత్తనాలు ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి, తీగజాతి, విత్తనాలు వేసుకొని పండించవచ్చన్నారు. ఈ నేపథ్యంలో పాలకొండ గ్రామంలో మూడు నెలల క్రితం పసుపు పంట సాగులో వేసిన అంతరపంటలను ఆయన పరిశీలించారు. పసుపు పంటలో అంతర పంటలపై అవగాహన కల్పించడంతో తాము తోటకూర, గుమ్మడి, గొంగూర వంటి పంటలు పండిస్తున్నామని వాటి ద్వారా ఇంటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పలు అంతర పంటలు వేసుకొని దిగుబడులు సాధించి, ఆర్థికాభివృద్ధి పొందవచ్చని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

దాత సహాయంతో ఆలయానికి రహదారి



రహదారి పనుల్లో గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని కొండపై గల రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన ఏళ్ల రాంబాబు కొండపైకి ఘాట్‌రోడ్ నిర్మాణానికి పూర్తి ఆర్థిక సహాయం అందిస్తుండగా గ్రామస్తులు కూడా పలు పనులు చేపట్టారు. శివాయం కొండపైకి వెళ్ళాంటే దాదాపు 200 మెట్లు వున్నాయని, మహాశివరాత్రి తదితర పర్వదినాల్లో వయస్సు పైబడిన భక్తులు కొండపైకి వెళ్లి పూజల్లో పాల్గొనేందుకు నానా ఇబ్బంది పడుతున్నట్టు గ్రామపెద్దలు చెప్పారు. కొండపైకి ఆటో వంటి చిన్న వాహనాలు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు దాత ముందుకు రావడం హర్షనీయమని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపెద్దలు ముప్పన మోహన్ కుమార్, నాగులాపల్లి కుశరాజు, పురోహితులు కప్పగంతుల కృష్ణశర్మ గ్రామస్తులు దాత రాంబాబును అభినందించారు. రానున్న రోజుల్లో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

నేత్ర పర్వంగా యానాద్రమ్మ పండగ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్త జనం



యానాద్రి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ యానాద్రమ్మ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యలమంచిలి పట్టణం ఏఎస్ఆర్ కాలనీలో ఆదివారం యానాద్రమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్త జనం పోటెత్తారు. ఏటా ఘనంగా నిర్వహించే ఈ పండగ మహోత్సవానికి యలమంచిలి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి పసుపు, కుంకుమ, చీర రవిక, గాజులు సమర్పించి, అమ్మవారిని పూజించారు. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, యలమంచిలి పట్టణానికి చెందిన వివిధ వార్డుల కౌన్సిలర్లు, భారీ సంఖ్యలో భక్తులు యానాద్రమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోడి పందాల్లో 8 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో కోడిపందాల నిర్వాహకులు

మునగపాక: మెలిపాకలో కోడిపందాల శిబిరంపై ఆదివారం ఎస్ఐ మహ్మద్ ఆలీ షరీఫ్ తన సిబ్బందితో దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 8 కోళ్ల తోపాటు రూ.12,400 నగదును స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వైభవంగా అమ్మవారి వేడుక

కశింకోట : కశింకోటలోని పొలాల్లో పెదపాడు వెళ్లే మార్గంలో వెలసిన సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, రైతులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అరటి గెలలు, చీరలు, రవికెల రూపంలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు.